# కథాకేళి



# అత్తగారు

# మల్లాది వెంకట కృష్ణమూర్తి

అర్థరాత్రి వచ్చిన ఆ టెలిగ్రాంలో వున్న వార్త "మీ అత్తగారికి సీరియస్‌గా వుంది. వెంటనే బయలుదేరండి". ఆ టెలిగ్రాం చదివిన చంద్రవదన కళ్లల్లో నీళ్లు తిరిగాయి. భర్తతో చెప్పింది-

"టేక్సీ మాట్లాడండి. వెంటనే బయ ల్దేరుదాం".

"ఇంత వర్షంలోనా? ఇంకా నాలుగు గంట లాగితే ఫస్ట్ బస్..."

"నే చెప్పినట్లు చేయండి" అరిచింది చంద్రవదన బాధతోకూడిన కోపంతో.

* * *

చాలా కాలం క్రితం జరిగిందా సంఘటన.

చంద్రవదన భర్త కంప్యూటర్స్ ట్రైనింగ్‌కి ఆఫీసు పంపితే అమెరికా వెళ్లాడు. ఆర్నెల్లు అక్కడే వున్నాడు. ఆ ఆరు నెలలు చంద్రవదన తన పుట్టింట్లో వుంది.

రోజూ ఇంటికి వచ్చే చంద్రవదన అన్నయ్య ఫ్రెండు మూడు నెలల్లో కలుపుగోలుతనంతో దగ్గరయ్యాడు. ఓ రోజు ఇంట్లో ఎవరూ లేనప్పుడు చంద్రవదన కేమయిందో తెలీదు. అతనికి ఫోన్ చేసింది. మండు వేసవిలో అతను ఆఫీస్ నించి వచ్చాడు. ఫేన్ లేని పక్క గదిలో బయట మూట పద్దెనిమిది డిగ్రీల ఎండ మండి పోతుంటే చంద్రవదన, అతను ఒకటయ్యారు.

రెండేళ్ల తర్వాత ఓసారి చంద్రవదన అత్తగారు వాళ్లింటికి వచ్చింది. ఇంటికి బూజులు తుడిపించారావిడ. ఆ రోజు రాత్రి చంద్రవదనని గుడికి తీసుకెళ్లి అక్కడ చంద్రవదనకి ఆవిడ ఓ కవరు ఇచ్చి చెప్పింది-

"ప్రతివాళ్లు ఓ తప్పు చేయడం సహజం"

ఆ వుత్తరం చంద్రవదన అన్నయ్య ఫ్రెండ్ జరిగింది వివరిస్తూ, అందుకు బాధపడుతూ రాసిన వుత్తరం!

ఆ విషయం మళ్లీ చంద్రవదన ఆమె అత్తగారికి మధ్య చర్చకు రాలేదు. కాని చంద్రవదన ఎంతో భయపడింది తన భర్తకి చెప్తుందేమో నని, చెప్తే అతను రియాక్ట్ అవుతాడా అని. అత్తగారు వారం తర్వాత వెళ్లేదాకా చంద్రవదన మనసు బితుకుబితుకు మంటూనే వుంది.

ఆవిడ వెళ్లాక తన భర్త ఆ విషయం చెప్పి తనతో లడాయి వేసు కుంటాడని ఆశించింది. కాని ఆమె ఎదురు చూసినట్టుగా అలా జరగలేదు. అత్తగారు తన రహస్యం తన భర్తకి చెప్పిందో, చెప్పలేదో అన్నది చంద్ర వదనకి సస్పెన్స్‌గానే వుంది. ఒకవేళ చెప్తే తన భర్త జరిగిందానికి రాజీపడి, తనకి తెలీనట్టుగా వూరుకున్నాడేమో అని కూడా అనుకుంది చంద్రవదన. కానీ భర్త ప్రవర్తనలో ఎలాంటి మార్పు లేదు. గతంలోలానే ఆదరంగా చూసుకోసాగాడు.

పెళ్ళికి ముందు కాని, ఆ తర్వాత కాని చంద్రవదన చేసిన ఏకైక తప్పు అదొక్కటే. చంద్రవదన భయపడ్డట్టుగా గర్భం రాలేదు. మిగతా మూడు నెలలు చంద్రవదన తన తోడికోడలు ఇంట్లో వుంది.

అది జరిగాక అతని నించి చంద్రవదనకి ఓ వుత్తరం వచ్చింది. ఇద్దరం తొందర పడ్డామని, ఇద్దరి తప్పు సమానంగా వుందని, జరిగిందానికి తాను చింతిస్తున్నానని రాసాడు. చంద్రవదన ఆ సంఘటనని మనసు లోంచి తుడిచేసింది.

ఆ వుత్తరాన్ని దాచి వుంచి నందుకు చాలాసార్లు చంద్రవదన తనలోనే బాధ పడింది.

* * *

రోడ్డుకి అడ్డంగా పడివున్న చెట్టుని చూసి చెప్పాడు చంద్రవదన భర్త.

"ఆగి బస్సులో వెళదామంటే విన్నావు కావు, చూసావా?"

డ్రయివర్, అతను కలిసి దాన్ని పక్కకి తీసి మళ్లీ ప్రయాణం సాగించారు.

ఉదయం పదిన్నరకి ఇంటి ముందు ఆగింది టేక్సీ. చంద్రవదన తోడి కోడలు టేక్సీ దిగుతున్న చంద్రవదనని చూసి గట్టిగా ఏడవడంతో అర్థం అయింది తన అత్తగారు ఇక లేరని.

లోపలికి వెళ్లి కళ్లు మూసుకుని నిద్రపోతున్నట్టుగా వున్న అత్తగారి మొహం, తల వెనక ప్రమిదలో వెలుగుతున్న వత్తిని చూసి అనుకుంది చంద్రవదన.

'ప్చ్! ఆవిడకి క్షమాపణ చెప్పే అవకాశం లేకుండాపోయింది, వెంటనే బయలుదేరినా'

ఇంకో తోడికోడలు చెప్పింది చంద్రవదనతో.

"కోడళ్ళంతా వున్నాం. నువ్వే లేవని నిన్ను చూడాలని కొట్టుకు పోయింది. పోయేముందు నీతో ఓ మాట చెప్పమంది".

"ఏమిటా మాట" అడిగింది చంద్రవదన.

"నీ రహస్యాన్ని తనతో తీసుకువెళ్ళి పోతున్నానని చెప్పమన్నారు"

చంద్రవదన గొంతులో ఏదో అడ్డు పడినట్టయింది. వంగి అత్తగారి రెండు పాదాలని తన చేతులతో స్పృశించి చెప్పింది-

"అర్థం చేసుకోవడం, భరించడం మీ గొప్పదనం అత్తయ్యా! మీరే లోకంలో వున్నా నన్ను మనసారా క్షమించండి"





22-12-89 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక